# జైల్లో చంద్రుడు

నేరం అనేది విద్యాహీనులూ చేస్తారు. విద్యాధికులూ చేస్తారు. మదోన్మత్తులూ చేస్తారు. సంస్కారవంతులూ చేస్తారు.

సమాజానికి ఏవిధంగానూ వుపయోగపడని వ్యక్తులు నేరస్తుల్లోనూ వుంటారు. మర్యాదస్తుల్లోనూ వుంటారు. కాని, సమాజానికీ మానవాళికీ సేవ చెయ్యగల వ్యక్తులూ-వుపయోగపడే వ్యక్తులూ కూడా నేరస్తుల్లో వుంటుంటారు.

* * *

జైల్లో ధర్మారావు తోటి ఖైదీలరోగాన్నీ, అనారోగ్యాన్నీ చూసి చలించి పోతున్నాడు. అతని మెదడులో అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయి. అతని గుండెలో గుండు సూదులు గుచ్చుకుంటూన్నాయి. ధర్మారావు భరించలేని బాధతో సతమత మవుతున్నాడు.

మహత్తర కళాఖండాన్ని సృష్టించే చిత్రకారుడికి శిక్షగా చెయ్యి నరికేస్తే - హృదయ స్పందన కలిగినప్పుడు తనూహించిన చిత్రాన్ని గీసే అవకాశం లేనందుకు అతను అనుభవించే బాధలాంటిది ధర్మారావు బాధ.

మధురగానంతో ప్రజలకి ఆనందం కలిగించే గాయకుడికి శిక్షగా నాలుక కోసేస్తే పాడాలనీ పాడలేక కృంగిపోయే అతని మనోవ్యధలాంటిది ధర్మారావు బాధ.

కె. వి. ఎస్. వర్మ

ధర్మారావు అనుక్షణమూ ఆలోచన్లలోనేమునిగి పోతున్నాడు. అతనికా జైలు జైలుగానే కాకుండా నరకంలా కూడావుంది. తోటి ఖైదీల రోగాల్ని చూస్తూ ధర్మారావులోని డాక్టర్ మౌనంగా వుండలేక పోతున్నాడు. ఎలాగైనా ఈ ఖైదీల రోగాల్ని బాగు చెయ్యాలి. వాళ్ళ అనారోగ్యాన్ని ఆర్పేసి ఆరోగ్యవంతుల్ని చెయ్యాలి. ఎలాగెలాగ ? తన ప్రయత్నం అసలు ఫలిస్తుందా ? ధర్మారావుకి ఎప్పుడూ అదే ఆలోచన. అతను పడుకున్నాడన్నమాటేగానీ నిద్రరావడంలేదు. నోట్లోంచి రక్తంపడుతూ బాధ పడుతున్న ఓ ఖైదీ కళ్ళ ముందు కదులుతున్నాడు. తక్షణం అతనికి వైద్యం చేస్తే జబ్బు తగ్గిపోతుంది. అతని రోగాన్ని రూపుమాపే అవకాశం ఏది ?

ఇంకో ఖైదీ కడుపునొప్పితో బాధ పడుతూ వంకర్లు తిరిగిపోతూ కళ్ళముందు కనిపించాడు. ధ్మరారావు అశాంతిగా అటూయిటూ దొర్లాడు. రోగాలతో బాధ పడుతున్న ఖైదీలని తలచుకుంటే అతనికి ఆవేదన అధికమవుతోంది. తను డాక్టర్ పట్టా పుచ్చుకునేటప్పుడు చేసిన ప్రతిజ్ఞ గుర్తుకుస్తోంది. రోగంతో బాధ పడుతున్న వ్యక్తి శత్రువైనా సరే రాత్రీ పగలూ అనే మీమాంసలేకుండా వైద్యం చేస్తానవీ, రోగి ప్రాణాన్ని తన శాయశక్తులా నిలబెట్టే ప్రయత్నం చేస్తానసీ ప్రమాణం చేశాడు. ఇప్పుడు తనకా అవకాశం ఏది? తనోహంతకుడిగా యావజ్జీవకారాగార శిక్ష అనుభవిస్తూ గడపమని కోర్టు తీర్పు యిచ్చింది. తనీ శిక్షని అనుభవించాలనే బాధలేదు. భయం అసలే లేదు. కాని యిలా నిర్జీవంగా నిర్లిప్తంగా రోగుల ఆర్తనాదాల్ని చూస్తూ ఎలా బతగ్గలడు ? ధర్మారావు భారంగానినిట్టూర్చాడు.

నిట్టూర్పుల సెగల్లో నిశిరాత్రి నెమ్మదిగా కదిలి కదిలి ధర్మారావు మెదడుని కత్తుల ఆలోచన్లతో కోసి కోసి కరిగిపోయి తెల్లవారింది.

ఖైదీలతో పాటు ధర్మారావు కాలకృత్యాలు తీర్చుకున్నాడు. ఖైధీ రంగనాధం ముఖం కడుగు కొంటూ విపరీతంగా దగ్గిదగ్గి రక్తాన్ని కక్కుకోవడం చూసి ధర్మారావు హృదయం ద్రవించిపోయింది.

ధర్మారావు జైలు సూపరింటెండెంట్‌ని కలుసుకోవడానికి ప్రయత్నించాడు. ఇంతకు ముందూ అటువంటి ప్రయత్నాలు చేశాడు కానీ ఫలించలేదు. ఇప్పుడు కొత్తగా సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ఈ జైలుకి ట్రాన్స్‌ఫరై వచ్చాడు ఇతనేమంటాడో ... తననో పురుగుగా చూస్తాడో...తన ఆవేదవని అర్థం చేసుకుంటాటో...లేదో...

జైలు సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తనని కలుసు కోడానికి ధర్మారావుని రమ్మన్నాడు. ధర్మారావు మనసులో కొత్త ఆశ చిగురించింది. ఆనందంతో అనుమానంతో చంద్రశేఖర్ ఆఫీసు గదిలోకి వెళ్ళాడు ధర్మారావు. చంద్రశేఖర్‌ని విష్ చేశాడు. చంద్రశేఖర్ చిరునవ్వుతో ధర్మారావుని కూర్చోమని కుర్చీ చూపించాడు.

"మీపేరు"

"ధర్మారావు"

"నన్నెందుకు కలవాలనుకున్నావు"

"నేనీ జైల్లో భరించలేని బాధనను భవి

స్తున్నాను. నేను చెప్పేది మీరు దయతో వింటారనీ, నా ఆవేదనని అర్థం చేసుకుని సహకరించమని విన్నవించుకోడానికి వచ్చాను.''

''బయట లోకంలోలాగ జైల్లో సుఖం ఎలా వుంటుంది? చేసిన తప్పు తెలుసుకుని పశ్చాత్తాపంతో మంచి మనిషిగా మారడానికేగా ఈ జైళ్ళూ ఈ శిక్షలూనూ''

''మీరన్నది నిజమే. నేనీ జైలో శిక్ష అనుభవిస్తున్నందుకు బాధపడటంలేదు...''

''మరి''

''నేను వృత్తిరీత్యా డాక్టర్ని. తోటి ఖైదీలరోగాల్నీ, వాళ్ళ బాధల్నీ చూస్తూ వుండలేక పోతున్నాను. వాళ్ళకి వైద్యం చేసే అవకాశం నాకిప్పించమని కోరుతున్నాను.''

''వీళ్ళని చూడటానికి మా డాక్టర్ వున్నాడు కదా''

''వున్నారు. నేను కాదనడంలేదు. ఆయనకి వీళ్ళందర్నీ ఓపిగ్గా పరీక్షించడానికి టైము సరిపోవడంలేదేమో నాకు తెలీదు. తోటి ఖైదీల రోగాల్ని చూస్తూ నేనీ యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తూ బతకలేను. పోనీ నాకు ఉరిశిక్ష వేయించేటట్టుచేసి పుణ్యం కట్టుకోండి'' ధర్మారావు గొంతు గద్గదమయింది.

చంద్రశేఖర్ ధర్మారావుని ఆశ్చర్యంగా చూశాడు. అతని మెదడులో రకరకాల ఆలోచన్లు మెదిలాయి.

''ధర్మారావుగారూ ఇంత సున్నితమైన మనసున్న మీరు హంతకుడెలా అయ్యారు.''

''నేను హంతకుడ్ని అని కోర్టు తీర్పు యిచ్చింది. నేను నా రెండో భార్యని చంపలేదు'' అన్నాడు ధర్మారావుగారు నిశ్చలమైన కంఠతో.

చంద్రశేఖర్ ధర్మారావు జీవిత విశేషాలున్న ఫైలుని క్లర్కు చేత తెప్పించి శ్రద్ధగా చదవ సాగాడు. ధర్మారావు మౌనంగా చంద్రశేఖర్ని చూస్తూ కూర్చుండిపోయాడు.

ఆ పట్నంలో ధర్మారావు దయాగుణం వున్న డాక్టరుగా మంచిపేరు తెచ్చుకున్నాడు. అతనికి భార్య, నలుగురు పిల్లలతోపాటు వేరే రెండోభార్య కూడా వుంది.

ఒకరోజున ధర్మారావు ధర్మాసుపత్రికి రెండో భార్య అరవిందని తీసుకువచ్చాడు. ఆమెని హాస్పటల్లో జాయిన్ చేసి పారిపోయాడు. అరవింద అప్పుడు ప్రాణతో లేదు. ఒళ్ళంతా కాలిపోయి వికృతంగా భయంకరంగావుంది. గవర్నమెంటు డాక్టర్లు ఆమెను పరీక్షించారు. కిరసనాయిలు పోసి నిప్పు అంటించడం వల్ల యీ దారుణం జరిగిందనీ, ఆ మంటల్లో ఆమె మసయిపోయిందనీ తీర్మానించారు. అరవింద మంటల్లో కాలుతుండగానో, కాలిపోయాకో ఆమెమీద నీళ్లు పోసినట్టు పరీక్షలో తేలింది.

పోలీసులు ధర్మారావుని వెదికి పట్టుకున్నారు. కోర్టులో-ధర్మారావు తన రెండో భార్య అరవిందని కిరసనాయిపోసి నిప్పు అంటించాడనీ, ఆ విషయం తెలియకుండా ఆమె ఒంటిమీద నీళ్ళుపోసి బతికించడానికి ప్రయత్నించి నట్టుగా నటించాడనీ ప్రాసిక్యూషన్ వాదించింది. కోర్టు ధర్మారావుని హంతకుడిగా నిర్ణయించి, యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. హాస్పటల్లో భార్యని అటువంటి అపాయకరస్థితిలో వదిలి పారి

పోవడం వల్ల కూడా అతనానేరం చేసినట్టు ధృవపడింది. ఐతే ధర్మారావు ఏ పరిస్థితి లోనూ తనానేరం చేసినట్టు ఒప్పుకోలేదు.

చంద్రశేఖర్ ధర్మారావు కేసు చదివి ఆలోచల్లో పడ్డాడు. ఎమ్.డి. పట్టాపుచ్చుకున్న డాక్టరు భార్యని కిరసనాయిలుపోసి చంపాలా? మరోలా చంపడానికి ఎన్ని అవకాశాలుండవు? ఐతే అరవింద వొంటిమీద నీళ్ళెవరు పోశారు? మంటల్లో కాలుతున్న వ్యక్తిపై యింగిత జ్ఞానమున్న వారెవరైనా నీళ్ళు పోస్తారా? అందునా డాక్టర్! ఐతే చావుబతుకుల మధ్య నలిగిపోతున్న భార్యని హాస్పటల్లో వదిలి భర్తనేవాడు వారిపోతాడా? బహుశా అతను చేసిన ఈ తెలివితక్కువ పన్లువల్లే అతనో హంతకుడిగా నేరం రుజువయ్యింది. చంద్రశేఖర్ ఆలోచన్ల నుంచి బయటపడి ధర్మారావుని అడిగాడు.

''భార్యా నలుగురు పిల్లలూవుండగా వారికన్యాయంచేసి నేను మళ్ళీపెళ్ళి చేసుకున్న పాపానికి నాకు ఈ సమాజం తగిన శిక్షే విధించింది. నేనాహత్య చెయ్యకపోయినా'' అన్నాడు ధర్మారావు విచారంగా.

చంద్రశేఖరు కొంతసేపు ధర్మారావుని చూస్తూ వుండిపోయాడు. ధర్మారావు ముఖములో అమాయకత్వంతోపాటు మానవత్వం కూడా తొణికిసలాడుతూ కనిపించింది.

అప్పుడు జైలు సూపరింటెండెంట్ చంద్రశేఖరు ''జైళ్ళు కేవలం బందిఖానాగా మాత్రమే పనిచెయ్యకూడదు. న్యాయస్థానాలు విజ్ఞానానికి శిక్ష విధించకూడదు. మనిషిచేసిన నేరానికీ మనిషికున్న విజ్ఞానానికీ సంబంధం లేదు. నేరస్తుడైన మనిషిలోని విజ్ఞానం సాంఘిక అభివృద్ధికీ, మానవశ్రేయస్సుకీ వుపయోగపడే ఆ శిక్ష ఆ ఉజ్వల విజ్ఞానానికి అడ్డు రాకూడదు.'' అనుకున్నాడు మనసులో.

తర్వాత జైలు అధికారులతోనూ, ప్రభుత్వంతోనూ సంప్రదించి చంద్రశేఖరు ధర్మారావులోని డాక్టరుకి బతుకునిచ్చాడు.

ధర్మారావు ఆనందానికి అవధుల్లేకపోయాయి. ఆ జైల్లో రోగులకి సేవచేస్తూ ధర్మారావు తృప్తిగా బతకసాగాడు—బాధల్ని గిరాటేసి

* * *

శిక్షని అనుభవించిన ఖైదీలు వెళ్ళిపోతున్నారు. నేరం చేసినవాళ్ళు కొత్తగా ఖైదీలవుతున్నారు.

రోజులు రకరకాల అనుభవాల అక్షరాల్ని కాలం కాగితంమీద రాస్తూ సాగిపోతున్నాయి.

చంద్రశేఖరు ఖైదీల పనుల్ని చూస్తూ జైలు ఆవరణలో పచార్లు చేస్తున్నాడు. అప్పుడు అక్కడ ఖైదీలు రాళ్ళను కొడుతున్నారు. కొత్తగా జైల్లోకి వచ్చిన సోమయ్య రాళ్ళని కొట్టలేనని దుఃఖిస్తున్నాడు. వార్డెన్ సోమయ్యని బెదిరిస్తున్నాడు.

చంద్రశేఖర్ సోమయ్య దగ్గిరకొచ్చాడు.

''రాళ్ళని ఎందుకు కొట్టనంటున్నావ్? నేరం చెయ్యగానే సరా? దానికి శిక్షని అనుభవించవద్దా? అన్నాడు జైలు సూపరింటెండెంట్ చంద్రశేఖర్.

''బాబూ. మీరేపని చెప్పినా సంతోషంగా స్తాను కానీ ఈ రాళ్ళను ముక్కలుచెయ్యలేను''

"ఏం"

"ఈ పెద్దపెద్ద రాళ్ళను రకరకాల శిల్పాలుగా మలచడమే నాకు తెలుసు. ప్రాణమున్న బొమ్మలుగా అందంగా చెక్కడమే నాకు తెలుసు. అంతేకాని ఈ రాళ్ళని ముక్కలు చెయ్యడం నాకు తెలీదు. అలా చెయ్యలేను. అలా చెయ్యడం నన్ను నేను నరుక్కున్నట్టుగానే వుంటుంది. మీకు పుణ్యం వుంటుంది. బాబు నన్నాపని చెయ్యమనకండి. మీరు చెయ్యమన్నా నాకంఠంలో ప్రాణం వుండగా నా ప్రాణంగా ప్రేమించే ఈ రాళ్ళని ముక్కల్ని చెయ్యలేను" అన్నాడు సోమయ్య కన్నీళ్ళు కారుస్తూ.

చంద్రశేఖరు ఆలోచనలో పడ్డాడు. సోమయ్య ఆవేదన అర్థమవుతోంది. సోమయ్య నేరానికి శిక్ష విధించాలి కానీ అతనిలోని "కళ"కి కాదేమో!

వార్డెన్‌తో సోమయ్యకి రాళ్ళుకొట్టేపని అప్పజెప్పవద్దని చెప్పి చంద్రశేఖరు తన ఆఫీసు రూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

సోమయ్య చంద్రశేఖరు వెళ్ళిన వేపుకే చూస్తూ చాలాసేపు నీళ్ళునిండిన కళ్ళతో వుండిపోయాడు. అతనకి గతం మసక మసకగా కన్పిస్తోంది.

ఆవేళ సోమయ్య తన మనసులో మెరిసిన మెరుపుని ఎంతో ఆనందంతో వుత్సాహంగా శిల్పంగా మలుస్తున్నాడు. ప్రొద్దుటనుండీ తిండి తినకపోయినా మనసులోని మధుర భావనని అతని చేతులు ఉలీ, సుత్తులతో శిల్పంగా చెక్కుతున్నాయి.

సోమయ్య భార్య చిరాగ్గా అతని దగ్గరికి వచ్చింది. అతను ఈ లోకంతో తనకు సంబంధం లేనట్టుగా శిల్పాన్ని చెక్కుతున్నాడు. సోమయ్య భార్యకి ఒళ్ళు మండిపోయింది. అతని చేతుల్లోని ఉలీ, సుత్తీ లాక్కోబోయింది. సోమయ్య ఉలిక్కిపడి చూశాడు. కోపంగానూ చూశాడు.

"ఏమిటి నువ్వు చేస్తున్నది"

"నీ బోడిబొమ్మలకి సంతోషించానుకానీ, పిల్లలు ఆకలితో ఏడుస్తున్నారు. ఇంట్లోఅన్నీ నిండుకున్నాయి. నీ బొమ్మలు కొనడానికి ఎవరొస్తారు? ఈ నిర్వాకం చాలించి ఇంకేదైనా పని చూసుకోకూడదూ" అంది వెటకారంగా సోమయ్య భార్య.

భార్య అన్న మాటలకి సోమయ్యకు చాలా ఉద్రేకం కలిగింది. తన శిల్పాన్ని హేళన చేస్తున్న భార్యమీద విపరీతంగా కోపంవచ్చింది. ఐనా అణచుకుని

"ఈ శిల్పాన్ని పూర్తిచెయ్యనీ. ఇప్పుడు పూర్తిచెయ్యకపోతే నా మనసులోని బొమ్మ చెరిగిపోతుంది.

సోమయ్య భార్య అతనిమాటలు విన్పించుకోకుండా విసురుగా అతని చేతిలోని ఉలి లాగేసింది. సోమయ్య ఆ క్షణంలో ఉద్రేకంతో వణికిపోయాడు. అప్పుడతను అలవి మీరిన ఆగ్రహంతో విచక్షణాజ్ఞానాన్ని కోల్పోయాడు. చేతిలోని సుత్తితో భార్య తల మీద గట్టిగా బాదేడు. ఆమె తల మధ్యగా విడిపోయింది. రక్తం ధారగా కారిపోయింది. చుట్టుప్రక్కల వాళ్లు గబగబా వచ్చారు. భార్య రక్తపుమడుగులో గిలగిల్లాడిపోతుంటే సోమయ్య విలవిల్లాడిపోయాడు. అప్పటికే పుణ్యకాలం మించిపోయింది.

అలా తనీ జైల్లోకి వచ్చాడు. ఆవేశంలో

తన భార్య చావుకు కారణమైనందుకు తనెంతగానో మనోవ్యధను అనుభవిస్తున్నాడు. ఆ బాధతోపాటు యిప్పుడీ బాధ! తనేవీ రాళ్ళను బద్దలు కొట్టలేదు నిష్కారణంగా. ఆ రాళ్ళతో ఎంత చక్కని శిల్పాన్ని సృష్టించవచ్చునో!

చంద్రశేఖరు జైలు అధికారుల నుంచి అనుమతిపొంది సోమయ్యకు శిల్పాన్ని చెక్కే అవకాశం కలిగించాడు. ఆ మాట విని సోమయ్య తన్మయత్వంలో మునిగిపోయాడు.

మెదడులో మెదిలే భావాలకి సోమయ్య తన చేతుల్లోని ఉలీ సుత్తులతో రకరకాల కొత్తకొత్త రూపాల్ని యివ్వసాగేడు రాళ్ళకి.

సోమయ్య తోటిఖైదీలు రాళ్ళని బద్దలు కొడుతూ సోమయ్యను ఈర్షగా చూసేవారు. తామంతా ఒళ్ళువంచి రాళ్ళను కొడుతుంటే సోమయ్య ఏ శ్రమాలేకుండా హాయిగా ఉలీ సుత్తులతో రాళ్ళమీద టిక్కుటిక్కు మని పిస్తూ సుఖంగా కాలం గడిపేస్తున్నాడని సోమయ్యమీద రోజురోజుకి అసూయ పెరిగిపోతోంది. సోమయ్యకంత సుఖాన్నిచ్చి తమకంత కష్టాన్నిచ్చిన సూపరింటెండెంటు చంద్రశేఖరు మీద వాళ్ళకి కోపం అంతకంతకూ అధికమవుతోంది.

రాళ్ళను కొడుతూన్న ఖైదీలని ఓమారు చూసి, సోమయ్య చెక్కుతూన్న శిల్పాన్ని చూస్తు నిలబడ్డాడు. చంద్రశేఖర్ తన్మయత్వంతో చూస్తున్న చంద్రశేఖరుని రాళ్ళని బద్దలు కొడుతున్న ఖైదీలు ద్వేషంతో చూశారు. గుసగుస లాడుకున్నారు. ఖైదీల చేతులు కసిగా పైకిలేచాయి. చంద్రశేఖరు మీద రాళ్ళవర్షం కురిసింది. రాళ్ళ దెబ్బలకి తట్టుకోలేక చంద్రశేఖరు నేల మీదికి వాలిపోయాడు. అంతలో పోలీసులు లాఠీలతో ఖైదీలని అదుపులో పెట్టారు.

డాక్టర్ ధర్మారావు గబగబావచ్చి చంద్రశేఖరు గాయాలకి వైద్యం చెయ్యసాగాడు. గాయాలకి కట్లుకట్టేక ధర్మారావుకి గుర్తొచ్చింది. చంద్రశేఖరు ప్రక్కనే వున్న శిల్పి సోమయ్యకూ్కడా దెబ్బలేమైనాతగిలాయేమోనని.

ధర్మారావు త్వరత్వరగా సోమయ్యదగ్గరికెళ్ళాడు. సోమయ్య వీపునుంచి నెత్తురు కారుతోంది. తనకవేం పట్టనట్టు సోమయ శిల్పాన్ని చెక్కుతున్నాడు. ధర్మారావు ఆశ్చర్యంగా సోమయ్యని చూశాడు. అతని వీపు మీది గాయాల్ని శుభ్రంచేసి మందురాశాడు.

◆ ◆ ◆

ధర్మారావులోని డాక్టర్ని బతికించి సోమయ్య కళకి ప్రాణంపోసి - అలావేసినందుకే తనిప్పుడు గాయాలతోబాధపడుతూ చంద్రశేఖరు-

గాయాలు తగిలినా లెక్కచెయ్యకుండా మనసులోని భావానికి రూపునిద్దుతున్న సోమయ్య-

సూపరింటెండెంటైనా, సోమయ్యైనా గాయపడ్డ మనుషులుగానే యెంచి వైద్యం చేసిన ధర్మారావు-

జైల్లో చంద్రుడెవరు?